ఈనాడు
శ్రీ సత్యసాయి
బుధవారం అక్టోబరు 9, 2024



రోదిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్



నిందితుడు వెంకటేష్

నమ్మినవాడే.. నరహంతకుడు

ఎదురింట్లో కుర్రాడు...
పైగా సొంతూరి వాడే...
కుమారుడు దూరంగా ఉండడంతో
అతడినే కుమారుడిలా నమ్మింది

అమ్మలా ప్రేమను పంచింది
అతనూ కొడుకులా ఉంటూ నమ్మించాడు
ఆకలైనప్పుడు అన్నం పెట్టింది
అతడు చేతికున్న బంగారు గాజులు చూశాడు

కష్టం వస్తే అయ్యో అని ఆదరిస్తే
అతను ఆమె మెడలో నగలు చూశాడు
తల్లిలా మమతను పంచితే
అతనిలోని నరరూప రాక్షసుడు హతమార్చాడు

- అమ్మలా ఆదరిస్తే అంతమొందించాడు
- మదనపల్లెలో ధర్మవరం సీఐ తల్లిపై ఘాతుకం

మదనపల్లెలో సంచలనం సృష్టించిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్యోదంతమిది. బిడ్డలా ఆదరించిన వ్యక్తే నిందితుడని తెలిసి అందరూ నివ్వెరపోవాల్సి వచ్చింది. ఈ ఉదంతం వెనుక వివరాలివి..

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62) కుమారుడు నాగేంద్రప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేస్తున్నారు. పట్టణంలో సొంతిల్లు ఉండడంతో తల్లి ఒక్కతే ఇక్కడ ఉంటోంది. వీరిది కలికిరి మండలం మేడికుర్తి. కాగా అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అతని తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సురేంద్ర కూడా మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీలోనే నివాసం ఉంటున్నారు. స్వగ్రామం, పరిచయస్థులు కావడంతో వెంకటేష్ కుటుంబంతో ఆమె సన్నిహితంగా ఉంటోంది. తన కుమారుడు దూరంగా ఉండడంతో కొడుకు వయసున్న వెంకటేష్‌తో కావాల్సిన వస్తువులు తెప్పించుకునేది. అతను మాత్రం ఆమె నగలు కాజేయాలని పథకం వేసి తన స్నేహితుడైన నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి చెందిన అనీల్‌ను జత కలుపుకొన్నాడు. వీరిద్దరూ హత్యకు కుట్రపన్నారు. గత నెల 28న కాశీ నుంచి ఓ స్వామీజీ వచ్చాడని అతని వద్ద చూపించుకుంటే ఎలాంటి రోగాలైనా మటుమాయం అవుతాయని స్వర్ణకుమారిని నమ్మించారు. అక్కడికి వెళ్లిన ఆమెకు నిద్రమాత్రలు కలిపి ఉన్న తీర్థాన్ని తాగించారు. ఆమె మత్తులో ఉన్నట్లుగానే సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అనంతరం ఆమె వద్ద ఉన్న నగలు తీసుకుని ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టి రూ.4.30 లక్షలు నగదు తీసుకున్నారు. తిరిగి వచ్చి గోనె సంచిలో ఆమె మృతదేహాన్ని ఉంచి అయోధ్యనగర్‌లోని శ్మశాన వాటికలో ఓ సమాధిని సగం తవ్వి పూడ్చేసి వెళ్లిపోయారు. స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర ప్రసాద్ తల్లి కన్పించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పది రోజులపాటు మదనపల్లె, శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేషే నిందితుడని నిర్ధారణ అయింది. మంగళవారం అతన్ని అరెస్టు చేసి పూడ్చిన శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహం బయటపడింది.

మమతల తల్లి.. : స్వర్ణకుమారి తన భర్త రెండో వివాహం చేసుకోవడంతో అతనితో విభేదించి చిన్నప్పుడే కుమారుడు నాగేంద్రప్రసాద్‌తో మదనపల్లెకు వచ్చి కష్టపడి చదివించారు. అలా కుమారుడు హాకీ క్రీడాకారుడిగా సత్తా చాటి బీటీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. క్రీడల కోటాలోనే ఎస్.ఐగా ఎంపికైన ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కువ కాలం పని చేసి ప్రస్తుతం సీఐగా ధర్మవరం ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడితో కొన్నాళ్లు ఉండడం, సొంతిళ్లు దెబ్బతింటుందని మదనపల్లెకు రావడం చేస్తుండేవారు. ఇంతలోనే నమ్మి ఆదరించిన వాడే నరరూప రాక్షసుడిగా మారి ఆమెను హతమార్చాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, నాగేంద్రప్రసాద్ స్నేహితులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరుకావడంతో విషాదం అలముకుంది. ఇప్పటికి వెంకటేష్‌ను మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనికి సహకరించిన అనీల్ పరారీలో ఉన్నాడు. హత్య జరిగిన రోజు అనీల్ తల్లి కూడా ఇంట్లోనే ఉండటంతో ఆమె కూడా సహకరించిందని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేసి నిందితులు ఇంకా ఏమైనా నేరాలు చేశారా? అని తెలిసే అవకాశం ఉంది. పరారీలో ఉన్న నిందితుడు అనీల్ కోసం ఓ బృందం గాలిస్తోందని అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రూ.62 కోట్లతో 990 పనులు



వీసీలో కలెక్టర్ చేతన్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీపీవో సమత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 990 పనులు గుర్తించి వాటికి సంబంధించి రూ.62 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 14 నుంచి 20 వరకు తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పల్లెపండగ కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా సమీక్షించారు. ఇప్పటి వరకు కొన్ని పనులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చి, అప్లోడ్ చేశామని, మిగిలిన వాటిని రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. పనులకు ఎలాంటి ఇసుక కొరత లేకుండా అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పనులన్నీ వారం రోజుల పాటు శంకుస్థాపనలు చేసి వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీపీవో సమత తదితరులు పాల్గొన్నారు.

సర్వీసులు ఇవ్వరు..

సామగ్రి లేదు!

- కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోని విద్యుత్తు శాఖ అధికారులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే


ఎక్కడి పనులు అక్కడే..

విద్యుత్తుశాఖలో వినియోగదారులు, రైతులకు సర్వీసులు విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. శాఖకు డీడీలు అందజేసినా సకాలంలో సర్వీసులను విడుదల చేయని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ సర్వీసులు, గృహ, వాణిజ్య సర్వీసులకు విడుదలకు, విద్యుత్తుశాఖ అభివృద్ధి (టీఅండ్‌టీ) పనులకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నియంత్రికలు, సామగ్రి, కండక్టరు, కేబుల్ వంటి వాటిని జిల్లా విద్యుత్తుశాఖ స్టోర్‌కు గత ఏడాది మార్చి నెల నుంచి విడుదల చేయలేదు. క్షేత్రస్థాయిలో పనులను విద్యుత్తు అధికారులు పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం రైతులు, వినియోగదారులు డీడీలు తీసి అందజేసి సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

- పుట్టపర్తికి చెందిన వెంకటేశ్ పొలానికి కరెంటు సర్వీసు పొందేందుకు డీడీ తీసి దరఖాస్తు చేసుకున్నాడు. 8 నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా సామగ్రి ఇవ్వలేదు. సమస్యను ఏఈ నుంచి ఎస్ఈ వరకు అందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కండక్టరు, నియంత్రిక లేవని కారణాలు చెబుతున్నారన్నారు. పొలాన్ని చదును చేయించేందుకు రూ.65 వేలు ఖర్చు చేశానని కరెంటు లేకపోవటంతోనే పంట సాగు చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- అనంతపురం డీ-5 సెక్షన్ పరిధిలో 60 మంది గృహ సర్వీసులు పొందేందుకు వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. కొంతమంది సర్వీసులకు ఒకటి నుంచి రెండు, నాలుగు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి కండక్టరు ఇవ్వాలి. మరికొన్ని సర్వీసులకు 25 కేవీ నియంత్రికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సదరు వినియోగదారులు విద్యుత్తు శాఖకు రూ.1.60 కోట్లు మొత్తాన్ని డీడీలు తీసి అందజేసినా 5 నెలలుగా పనులు పూర్తి చేయలేని పరిస్థితి.

స్టోర్‌లో ఏవీ లేవు..

జిల్లా స్టోర్‌లో అత్యవసరానికి కూడా 25 కేవీ నియంత్రికలు అందుబాటులో లేని పరిస్థితి. ఎక్కడైనా తీగలు తెగితే వాటికి అతుకులు వేసేందుకు కండక్టరు, కేబుల్ కూడా స్టోర్‌లో నిలువ లేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులు, వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టింపు లేదు.



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

- వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తులు: **15,295**
- డీడీల మొత్తం: **రూ.45.88 కోట్లు**
- అవసరం: **2,820 కిలోమీటర్లు కండక్టరు, 25 కేవీ సామర్థ్యం గల 4,320 నియంత్రికలు, 508 కిలోమీటర్ల కేబుల్**
- గృహ సర్వీసుల సామగ్రికి దరఖాస్తులు : **479**
- వీరు ఇచ్చిన డీడీలు: **రూ.1.67 కోట్లు**
- అవసరం : **152 కిలోమీటర్ల కండక్టరు, 1,960 విద్యుత్తు స్తంభాలు**
- వాణిజ్య సర్వీసులకు దరఖాస్తులు: **198**
- తీసిన డీడీలు: **రూ.89.10 లక్షలు**
- అవసరమైన సామగ్రి : **98 కిలోమీటర్ల కండక్టరు, 792 స్తంభాలు**
- మొత్తంగా కండక్టరు అవసరం: **7000 కి.మీ**
- అనుబంధ సామగ్రి: **ఏదీ అందుబాటులో లేదు.**

త్వరలోనే వస్తాయి..

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

గత ఏడాది మార్చి నుంచి విద్యుత్తు సామగ్రి సరఫరా కావటం లేదు. కండక్టరు, కేబుల్ సరఫరా ఆగిపోయింది. జిల్లాలో రైతులు, వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.



ధనలక్ష్మి దర్శనం.. భక్తజన భాగ్యం!

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గోరంట్లలో వాసవీమాత దనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.40 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు దర్శనం చేసుకుని తరించారు.

-న్యూస్‌టుడే, గోరంట్ల

సీడబ్ల్యూఎస్ పథకాలతో..

కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కోరిన సత్యకుమార్ యాదవ్

జలజీవన్ మిషన్ అనుసంధానం చేయండి



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్


ధర్మవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాలతో జలజీవన్ మిషన్‌ను అనుసంధానించి సమస్యను పరిష్కరించాలని కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం దిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర జలవనరులశాఖ మంత్రి కార్యాలయంలో ఆయనను కలసి జలజీవన్ మిషన్ అనుసంధానం గురించి చర్చించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని, తాగడానికి కూడా వీలు కాకుండా ఉందన్నారు. పెన్నహోబిలం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నుంచి సత్యసాయి సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీరు అందుతోందన్నారు. సత్యసాయి నీటి సరఫరా బోర్డు పరిధిలోని 19 పథకాల ద్వారా జిల్లాలో తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. జలజీవన్ మిషన్‌ను సీపీడబ్ల్యూఎస్ పథకాలతో అనుసంధానిస్తే ఉమ్మడి జిల్లాలో ప్రతి ఇంటికీ తాగు నీరు అందుతుందని కేంద్రమంత్రికి వివరించారు.

నీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం: కలెక్టర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాల ఎన్నికలను సజావుగా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 230 నీటి సంఘాలు ఉన్నాయని, ఈనెల 16 ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూలు, నామినేషన్ పత్రాల దాఖలు పక్కగా నిర్వహించడం జరుగుతుందన్నారు. నీటి వినియోగదారుల సంఘానికి 6 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని, అందులో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక ఉంటుందని వివరించారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ కొండయ్య, జలవనరులశాఖ అధికారి దేశనాయక్, ఆర్డీవోలు మహేష్, ఆనంద్, శర్మ, నీటిపారుదలశాఖ అధికారులు గంగాధర్, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రహసనం.. పాఠశాల ప్రహరీల నిర్మాణం

- వైకాపా హయాంలో నిర్లక్ష్యం
- ఎన్డీఏ ప్రభుత్వంపై ఆశలు



పునాదికే పరిమితమైన వరిగిరెడ్డిపల్లి పాఠశాల ప్రహరీ

కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.9.66 లక్షలతో ప్రహరీ మంజూరైంది. వైకాపా ప్రభుత్వంలో పనులు ప్రారంభించారు. ఇందులో గదులు, తాగునీటి పనులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినా ప్రహరీ మాత్రమే మిగిలింది. పాఠశాల కదిరి-పుట్టపర్తి ప్రధాన రహదారిపై ఉంది. దీంతో పిల్లలు ఆడుకునే క్రమంలో రోడ్డుపైకి వస్తున్నారు. వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉంది. కౌలేపల్లి క్వార్టర్స్, టి.కెంట్లపల్లిలలో ఇనుప ఊచలు ఏర్పాటు చేసి వదిలేశారు.

పాఠశాలలు	1,081
ప్రహరీ మంజూరైనవి	373
నిధులు	రూ.34.84 కోట్లు
పునాదుల్లో ఉన్నవి	182
సూపర్ స్ట్రక్చర్	77
తుదిదశలో	52
గేట్లు పెట్టాల్సినవి	16
పూర్తయినవి	46

కదిరి, కొత్తచెరువు, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన ప్రహరీల నిర్మాణం ప్రహసనంగా మారింది. పిల్లలు చదువుకునే బడులకు రక్షణ గోడలు లేకపోవడంతో భద్రత కరవైంది. పాఠశాలల స్థలాలు ఆక్రమణకు గురవకుండా, ఆకతాయిలు, పశువులు చొరబడకుండా ప్రహరీలు రక్షణగా ఉంటాయి. రోడ్డు పక్క పాఠశాలల వైపు వాహనాలు దూసుకు రాకుండా ప్రమాదాల నివారణకు వీలవుతుంది. పిల్లలు రోడ్డుపైకి వెళ్లకుండా ఉండేందుకు దోహదపడతాయి. అందుకు అనుగుణంగా నాడు-నేడు పథకం రెండో విడత కింద 2021-22లో పనులు మంజూరు చేశారు. కానీ, నాటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పురోగతి సాధించలేదు.

★ శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 373 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు చేశారు. ఇందులో 46 మాత్రమే పూర్తవగా.. మరో 16 చోట్ల గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయాయి. ప్రహరీలకు తీసిన పునాదుల గుంతలు, పునాదులపై ఏర్పాటు చేసిన ఇనుప ఊచలను అలాగే ఉండటంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు మొదలు పెట్టినా ప్రయోజనం లేకుండా ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



కమ్మపాలెం పాఠశాలలో శిథిలావస్థలో ప్రహరీ

కొత్తచెరువు మండలం కమ్మపాలెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ, ఇతర పనులకు రూ.16 లక్షలు కేటాయించారు. ఇందులో ప్రహరీ పనులు మాత్రమే మిగిలాయి. గతంలోని ప్రహరీ నెర్రలు చీలి శిథిలావస్థలో ఉంది. దీనికి గేటు లేకపోవడమేగాక పాఠశాల ప్రధాన రోడ్డుకు అనుకుని ఉంది. నిత్యం వాహనాలు రద్దీగా వెళ్తుంటాయి. దీంతో విద్యార్థులకు ప్రమాదకరంగా ఉంది. ప్రహరీ, గేటు లేకుండటంతో సెలవు దినాల్లో ఆకతాయిలకు ఆలవాలంగా మారుతోంది.

ప్రభుత్వ ఆదేశాలతో పనులు పూర్తి చేస్తాం

- జయచంద్ర, నాడు-నేడు పనుల కోఆర్డినేటర్

నాడు-నేడు రెండో విడత కింద గదులు, మరుదొడ్ల పనులు పూర్తి చేశాం. చివరగా చేయాల్సిన ప్రహరీ పనులు మిగిలాయి. ఇంతలో ఎన్నికలు రావడం, పాఠశాల కమిటీలు మారడంతో కొంత ఆలస్యమైంది. కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపట్టి ప్రహరీలు పూర్తి చేస్తాం.

అక్రమార్కులపై వేటు!

డీఈ, ఏఈ సస్పెన్షన్

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాల్లో అక్రమాలకు తలూపారు. వైకాపా నేతలకు ఒక్కొక్కరికి రెండు, మూడు ఇళ్లు ఇచ్చి బిల్లులు చేశారు. వైకాపా ఎమ్మెల్యే చెప్పిందే వేదంగా రాప్తాడు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల్లో భారీ ఎత్తున తప్పిదాలకు పాల్పడ్డారు. ఆఖరికి భార్య, భర్తలకు సైతం ఇళ్లు ఇచ్చి బిల్లులు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. ప్రతి పక్షంలో ఉన్న మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై విచారణ చేయాలని అప్పటి కలెక్టరు గౌతమిని కోరారు. ఈనేపథ్యంలో విచారణకు ఆదేశించారు. విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేలినా చర్యలు చేపట్టకుండా నివేదికను తొక్కిపెట్టారు. వైకాపా నేతల ఒత్తిళ్లు, అప్పటి గృహ నిర్మాణశాఖ పీడీ వైకాపాతో ఉన్న సంబంధాలతో అక్రమార్కులను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరోసారి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు చేపట్టాలని ఆ శాఖ మంత్రి, ఎండీకి రెండు నెల్ల క్రితం ఆదేశాలు ఇచ్చారు. ఎట్టకేలకు అక్రమాలకు ఒడిగట్టిన అధికారులపై చర్యలకు ఉపక్రమించారు.

చర్యలతో అధికారుల్లో దడ

రాక్రీట్ సంస్థలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విజిలెన్సు దర్యాప్తు కొనసాగుతుండగానే రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం గ్రామీణంలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో భారీగా అక్రమాలు సాగాయని తేల్చారు. ఈ క్రమంలో అనంతపురం అర్బన్, రాప్తాడు డీఈగా పని చేసిన కృష్ణారావు, అనంతపురం గ్రామీణం ఏఈగా పని చేసిన వినోద్‌కుమార్‌ను సస్పెన్షన్ చేస్తూ గృహ నిర్మాణ సంస్థ ఎండీ రాజబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమాల్లో భాగస్వామ్యమైవంత పాడిన మరో ఆరు మందికి ఛార్జి మెమోలు జారీ చేసి వారు చేసిన తప్పిదాన్ని బట్టి చర్యలు తీసుకోనున్నారు.

గుత్తి తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

42 ప్రమాణాల పాటింపుతో దక్కిన వైనం


కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న తహసీల్దారు ఓబులేసు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావాలంటే 39 రకాల ప్రమాణాలను పాటించాల్సి ఉంది. అయితే గుత్తి తహసీల్దారు కార్యాలయంలో 42 ప్రమాణాలు పాటిస్తుండటం విశేషం. ఇది వరకు గుంతకల్లు ఆర్డీవో కార్యాలయానికి ఈతరహా గౌరవడం దక్కింది. ఇప్పుడు ఆ జాబితాలో గుత్తి తహసీల్దారు కార్యాలయం చేరడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి సూచనలతో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు 42 ప్రమాణాలు పాటించారు. ప్రత్యేకంగా సిటిజన్ ఛార్టర్, రిసెప్షన్ కౌంటర్, కంప్యూటర్ నంబరింగ్, ఆర్టీఐ ప్రదర్శన బోర్డు, రికార్డు రూం నిర్వహణ తదితర అంశాలతో ప్రమాణాలు పాటించారు. మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని తహసీల్దారు ఓబులేసుకు ప్రదానం చేశారు.

అభద్రతలో ఆపద్బాంధవులు!

- సామర్థ్య ధ్రువపత్రం, బీమా లేని 108
- అంబులెన్సుల నిర్వహణ తీరు అధ్వానం


సామర్థ్యం, బీమా లేని 108 వాహనం

హిందూపురం, మడకశిర, పెనుకొండ, న్యూస్‌టుడే: అత్యవసర సమయాల్లో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆపద్బాంధవుల్లా తోడ్పడాల్సిన 108 వాహనాలు అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 66 వాహనాల్లో దాదాపు 52 వాహనాలకు 2022 నుంచి సామర్థ్య ధ్రువపత్రం (ఫిట్‌నెస్ సర్టిఫికెట్), బీమా లేకున్నా యాజమాన్యం పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడైనా ప్రమాదాల బారిన పడితే పైలెట్‌నే బాధ్యుడిని చేస్తున్నారు. ఏపీ39 టీఎల్ సీరియల్ నంబరు ఉన్న 108 వాహనాలే ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉన్నాయి. వాటిల్లో ఒక్క వాహనానికీ సామర్థ్య, బీమా లేదు. ఒక్కో వాహనం దాదాపు 5లక్షల కి.మీ వరకు తిరిగినా కొనసాగిస్తున్నారు. తొలుత జీవీకే, అనంతరం జీవీజీ తర్వాత అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ వారు నిర్వహిస్తున్నారు.

తరచూ మరమ్మతులు

ఉమ్మడి జిల్లాలో మండలానికి ఒక 108 వాహనం ఉంది. ఒక్కో వాహనం రోజుకు సుమారు 300 కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుంటుంది. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రెఫర్ కేసులు ఉంటాయి. ఇలాంటి సమయంలో వాహనాలకు భద్రత ఎంతో అవసరం. మరోవైపు 90 శాతం వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని తరలించే సమయంలో వాహనం ఆగిపోయినా, ప్రమాదానికి గురైనా తీరని నష్టం కలుగుతోంది. గతనెల 22న లేపాక్షి మండలం గొంగటిపల్లి వద్ద ద్విచక్రవాహనంలో అశ్వర్థప్ప వెళుతుండగా శునకాల దాడికి యత్నించాయి. తప్పించుకొనే క్రమంలో 108 వాహనాన్ని ఢీకొన్నాడు. 108 వాహనం ఆగిపోగా.. పైలెట్‌ను విధులకు దూరంగా ఉంచారు.

వెంటనే చేయించాలి

108 వాహనాలకు ఫిట్‌నెస్, బీమా లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాంటి వాహనాలకు సామర్థ్య పరీక్ష చేయించి ధ్రువపత్రం తీసుకోవాల్సి ఉంది. అలాగే బీమా తప్పనిసరిగా చేయించాలి.

- కరుణాసాగర్‌రెడ్డి, జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్, బీమా విషయంపై యాజమాన్యం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. **- కొండారెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి 108 మేనేజర్, అనంతపురం**

జాతీయస్థాయి జూడోలో కాంస్య పతకం


అఫ్జల్ మెహరాజ్‌తో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అఫ్జల్ మెహరాజ్ జాతీయ స్థాయి జూడో పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. మంగళవారం పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు గుజరాత్ మెహసనలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జూడో జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలు జరిగాయన్నారు. అండర్-14లో 50 కేజీ విభాగంలో అఫ్జల్ మెహరాజ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాడు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు, కేంద్రపాలిత ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారని పీడీ వివరించారు. ఈ సందర్భంగా విజేతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్ బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 32.5 నుంచి 34.8 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 23.5 నుంచి 24.6 డిగ్రీగా నమోదవుతాయన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 12 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 83 శాతం, మధ్యాహ్నం పూట 65 శాతం ఉంటుందన్నారు. నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పంట విత్తుకోవడానికి అనువైన సమయమని రైతులు విత్తుకోవడానికి ప్రయత్నాలు చేసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి వాహనంపై దాడి


పగిలిన స్కార్పియో వాహనం అద్దం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం శివానగర్‌లో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్‌కు చెందిన స్కార్పియో వాహనంపై దాడి జరిగింది. హరీశ్ నివాసం ఉంటున్న ప్రాంతంలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనంపై గుర్తు తెలియని యువకుడు రాయితో దాడి చేసి ద్విచక్ర వాహనంలో పరారయ్యాడు. స్కార్పియో వాహనం అద్దం ఒకవైపు పగిలింది. విషయం తెలుసుకున్న హరీశ్ 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. వాహనం వద్ద పడి ఉన్న రాయిని పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. దాడి అనంతరం ఒక యువకుడు ద్విచక్ర వాహనంలో పరారీ కావడాన్ని గుర్తించారు. 1వ పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో చేరిన హెచ్చెల్సీ ఉప ఎస్ఈ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్): హెచ్చెల్సీ ఉప ఎస్‌ఈగా సూర్య భాస్కర్‌శర్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ ఉప సీఈగా బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. పోలవరం ప్రాజెక్టులో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చిన సూర్య భాస్కర్ శర్మ ఇక్కడి విధుల్లో చేరారు. మరోవైపు.. కీలకమైన హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈగా ఆర్ఎస్ఆర్ పుల్లారెడ్డి కూడా బాధ్యతలు తీసుకున్నారు.

కంది పంటను కాపాడుకుందాం

అనంతపురం (వ్యవసాయం): జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ రవి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురం గ్రామీణం అక్కంపల్లి, రాచానాపల్లి గ్రామాల్లో వేరుసెనగ కంది పంట పొలాలను సందర్శించారు. పంటను పూత, కాయ దశలో కాపాడుకుంటే మేలైన దిగుబడులు వస్తామన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మోసం

యాడికి, న్యూస్‌టుడే : వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మబలికి ఓ విద్యార్థిని తండ్రితో రూ.లక్షలు ఇప్పించుకుని మోసం చేసిన ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలో వెల్డింగ్ పని చేసుకుంటున్న యజ్ఞానిబాషా తన కూతురు వి.ఆరీఫాను 22-23 సంవత్సరంలో వైద్య విద్య అభ్యసించడానికి ఉపక్రమించాడు. దీనికి గాను తెలిసిన మిత్రుడితో కలిసి న్యూ వే ఎడ్యుకేషన్స్ సర్వీసెస్‌ను సంప్రదించారు. సంస్థ నిర్వాహకులు విజయనగరానికి చెందిన సరితి గణేశ్, సరితి రామారావుతో మాట్లాడారు. ఫిలిప్పీన్స్ దేశంలోని యూవీ గుల్లాస్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ చేయిస్తామని, మొదటి సంవత్సరానికి గాను ఫీజు రూ. 6.75 లక్షలు అవుతుందని చెప్పారు. వారి మాటలు నమ్మిన యజ్ఞానిబాష తొలి విడతగా రూ.3.30 లక్షలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఇప్పటి వరకు తరగతులు నడవటం లేదంటూ చెప్పుకొంటూ వచ్చారు. ఆలస్యం కావడంతో తీవ్ర బాధితుడు ఒత్తిడి పెంచాడు. దీనికి గాను అడ్మిషన్ చేసినట్లు ధ్రువపత్రాలు ఇచ్చారు. వీటిని ఫిలిప్పీన్స్ కళాశాలకు సంబంధించి చెన్నైలో నడుస్తున్న నీయోలైఫ్ కన్సల్టెన్సీని సంప్రదించడంతో పాటు, ఆ దేశంలోని కళాశాలలో చదువుతున్న తెలిసిన విద్యార్థులకు పత్రాలు పంపించగా, ఆరీఫా పేరు మీద అడ్మిషన్ జరగలేదని, నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారని తెలిసిపోయింది. దీనిపై సంస్థ నిర్వాహకులను నిలదీయగా దిక్కున్న చోట చెప్పుకోండంటూ భయపెట్టారు. కూతురి విద్యా సంవత్సరం వృథా కావడమే కాకుండా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తాను మోసపోయానని గ్రహించి ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. దీనిపై పరిశీలన చేపట్టాలని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో యాడికి సీఐ ఈరన్న బాధితుడిని పిలిపించి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయనగరంలోని సంస్థ నిర్వాహకులను పిలిపించే విషయంపై చర్యలు చేపట్టారు.

బాలికపై శునకాల దాడి


గాయపడిన శ్రీనిధిరాయ్

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని జౌకలకొత్తపల్లికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రీనిధిరాయ్ అనే బాలికపై మంగళవారం శునకాలు దాడి చేయడంతో గొంతు, ముఖంపై గాయాలయ్యాయి. బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలు.. బాలిక ఆరుబయట నిలబడి ఉండగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అప్రమత్తమైన తల్లిదండ్రులు శునకాలను తరిమివేశారు. గతంలో కూడా చినగానిపల్లి, అమడగూరు, మహమ్మదాబాద్, చిన్నపానిపల్లి గ్రామాల్లో వీధి కుక్కలు చిన్నారులు, ప్రజలపై దాడులు చేసి గాయపరిచాయి. మహమ్మదాబాద్ గ్రామ పొలానికి వచ్చిన ధర్మవరం గొర్రెల కాపరులకు చెందిన దాదాపు 100 గొర్రె పిల్లలు వీధికుక్కల దాడిలో చనిపోయాయి. గ్రామాల్లో చికెన్ దుకాణాల వద్ద వచ్చి మాంసం తినటానికి అలవాటు పడిన కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి శునకాలు గ్రామాల్లో లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

నల్లమాడ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బొగ్గలపల్లికి చెందిన గురప్పకు దొన్నికోట గ్రామానికి చెందిన గంగమ్మ(40)తో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి కాపురం అన్యోన్యంగా సాగింది. నెల రోజుల కిందట బతుకు తెరువు కోసం గంగమ్మ, గురప్ప దొన్నికోటకు వెళ్లి అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈనెల 7న కుటుంబ విషయంలో భార్యాభర్తలిద్దరూ వాదులాడుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన గంగమ్మ విష ద్రావణం తాగి స్పృహ కోల్పోయింది. భర్త ఆమెను 108 సాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దాదాకలందర్ తెలిపారు.

ట్రాక్టరు బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

ఐదుగురికి గాయాలు


బోల్తాపడిన ట్రాక్టర్


విద్యుత్తు సామగ్రి కింద నలిగిపోయిన సిబ్బంది

తలుపుల, న్యూస్‌టుడే: విద్యుత్తు సామగ్రి తీసుకెళ్తూ ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడటంతో జార్ఖండ్‌కు చెందిన యువకులు సునీల్ (28), దనియాల్ (26) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడినట్లు ఏఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. తలుపుల మండలం తొగటవాండ్లపల్లికి చెందిన విద్యుత్తు కాంట్రాక్టరు సిద్ధార్థనాథ్‌రెడ్డి నంబులపూలకుంట మండలంలో విద్యుత్తు పనులు చేస్తున్నప్పుడు వాటికి సంబంధించిన సామగ్రిని ఇంటివద్దనే నిల్వ ఉంచుకున్నారు. దాదాపు 2 నుంచి 3 టన్నుల బరువు కలిగిన విద్యుత్తు తీగల బండిల్, ఇతర సామగ్రిని పని ప్రదేశానికి మంగళవారం సాయంత్రం ట్రాక్టరులో తీసుకెళ్తూ పోలేరమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో ట్రాక్టరును రోడ్డు దింపడంతో బండిల్ ఒకవైపు దొర్లిపోయింది. ఆ తూకానికి ట్రాక్టరు తొట్టి బోల్తా పడింది. అందులో ఉన్న సునీల్, దనియాల్ సామాగ్రి కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడటంతో వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కదిరి గ్రామీణ సీఐ మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

గొంతు కోసుకుని ఉన్మాది వీరంగం

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన ఓ వివాహితను కొంతకాలంగా వెంటపడి వేధిస్తున్న ప్రేమోన్మాది ఆమె ఇంటి వద్దకు వెళ్లి గొంతుకోసుకుని వీరంగం సృష్టించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. గుట్టూరుకి చెందిన వివాహిత సోమందేపల్లి మండలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న చిలమత్తూరు మండలంలోని కొడికొండ గ్రామానికి చెందిన కొర్లకుంట అలీంబాషా అనే యువకుడు కొంతకాలంగా ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. భరించలేక వివాహిత కుటుంబ సభ్యులకు తెలిపింది. కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అలీంబాషా మంగళవారం సాయంత్రం గుట్టూరులోని వివాహిత ఇంటి వద్దకు వెళ్లి వీరంగం సృష్టించాడు. మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్లు అక్కడికి చేరుకోవడంతో భయంతో అలీంబాషా వెంట తెచ్చుకున్న చాకుతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని అతడిని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పెనుకొండ సీఐ రాఘవన్ ఘటనపై వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై కేసు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ బస్టాండులో సొంత కూతురును వదిలివెళ్లిన జ్యోతి ఫిర్యాదు ఆధారంగా ఆమె రెండో భర్తపై కదిరి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గుమ్మఘట్ట మండలానికి చెందిన జ్యోతి మొదటి భర్త మరణించడంతో ఉపాధి కోసం కర్ణాటకకు వెళ్లి అక్కడ కుమార్ అనే వ్యక్తిని రెండోపెళ్లి చేసుకుంది. వీరిద్దరికి కూతురు పుట్టింది. భర్త వేధింపులు తాళలేక బిడ్డతో పాటు ఆమె కర్ణాటక నుంచి కదిరికి వచ్చేసి బస్టాండులో పాపను మరో యువతికి అప్పగించి వెళ్లిన విషయం తెలిసిందే. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనతోనే పాపను వదిలివెళ్లినట్లు జ్యోతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె రెండోభర్త కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం మండలం బసవనపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పావగడ తాలూకా చిక్కతిమ్మనహట్టి గ్రామానికి చెందిన అందజినప్ప కుమారుడు తిప్పేస్వామి(48) అక్కడికక్కడే మృతి చెందాడు. మడకశిర నుంచి అమరాపురం వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్న తిప్పేస్వామిని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్సై రామాంజినేయులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మామిడితోటలో మహిళ హత్య

మూడ్రోజుల కిందటే జరిగినట్లు అనుమానం


రామలక్ష్మమ్మ


సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని సుబ్బయ్య నారవ సమీపంలోని మామిడి తోటలో కాపలాగా ఉన్న పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ (52) అనే వివాహిత హత్యకు గురైంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి విజయవాడలో సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. ఆయనకు అమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల సరిహద్దులో సుబ్బయ్యనారవ సమీపంలో మామిడితోట ఉంది. ఏడాది నుంచి పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ నెల వేతనం కుదుర్చుకుని తోటతోపాటు పాడి ఆవు సంరక్షణ చేసుకొంటూ అక్కడే జీవిస్తోంది. కుమారుడు పురుషోత్తం, కోడలు కదిరి కుటాగుళ్లలో నివాసం ఉంటున్నారు. తల్లిని చూడటానికి మంగళవారం తోట వద్దకు వచ్చిన పురుషోత్తం రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటంతో సమీపంలోని రైతుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రామలక్ష్మమ్మను బయటనే పారతో హత్య చేసి మృతదేహాన్ని గదిలోకి తీసుకెళ్లి మంచంపై పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు వాడిన పార, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. తోట యజమానికి, బంధువులకు భూమికి సంబంధించిన సమస్యలు ఉన్నట్లు సమాచారం. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు కదిరి, నల్లమాడ సీఐలు సునీత, మోహన్, ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, జబీవుల్లా, ఈశ్వర్ పాల్గొన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఇంద్రియాలను జయించడమే దసరా విశిష్టత


జపాన్‌లో నిర్వహించిన రావణబ్రహ్మ కార్యక్రమంలో ముద్దిరెడ్డిపల్లి వాసులు

హిందూపురం అర్బన్ : పది ఇంద్రియాలను జయించడమే దసరా పండుగ విశిష్టత అని ముద్దిరెడ్డిపల్లి త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ శనివారం జపాన్‌లోని కిరిగా గ్రీన్‌టౌన్ ఫంక్షన్‌హాల్‌లో రావణబ్రహ్మ, భగవద్గీత విశిష్టత కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భగవాన్ రావణబ్రహ్మ విశిష్టతను హిందువులకు తెలియజేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, భార్గవి, పునీత్ రాజ్‌లు పాల్గొన్నారు. ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల నుంచి ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ఎంపీ పూజలు


ఎంపీ బీకే పార్థసారథిని సత్కరించిన నాయకులు

రొద్దం: మండలంలోని దొడగట్ట గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఎంపీ బీకే పార్థసారథి మంగళవారం పూజలు చేశారు. గంగమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, గుడికట్లు, తెదేపా నాయకులు ఎంపీకి స్వాగతం పలికి సత్కరించారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి జీవీపీ నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నాయకులు వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచి జయప్ప, నాయకులు రామచంద్ర, హైటెక్ రామకృష్ణ, తదితరులు వెంట ఉన్నారు.

బీసీలుగా గుర్తించాలని ఎంపీకి వినతి

పెనుకొండ : జిల్లాలోని సాదరగౌడ కులస్థులను రాష్ట్రంలో బీసీలుగాను, కేంద్రంలో ఓబీసీలుగాను గుర్తించాలని మంగళవారం ఆసంఘం నాయకులు ఎంపీ బీకే పార్థసారథిని కోరారు. స్పందించిన ఎంపీ బీసీల్లో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆసంఘం నాయకులు ఎంపీని సత్కరించారు. అదేవిధంగా పలుశాఖల అధికారులు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు.

వేరుసెనగలో పంటకోత ప్రయోగాలు

గోరంట్ల: పాలసముద్రం పంచాయతీ రాగిమాకులపల్లిలో నరసింహప్ప అనే రైతుకు చెందిన పొలంలో మంగళవారం వేరుసెనగ పంటకోత ప్రయోగాలు చేపట్టారు. సర్పంచి గంగప్ప, తెదేపా నాయకులు మనోహర్, జయచంద్ర, ఆదినారాయణ, మండల వ్యవసాయాధికారి మునికృష్ణ పర్యవేక్షణలో వేరుసెనగ దిగుబడులు పరిశీలించారు. మధ్యరకంగా దిగబడులు వచ్చినట్లు ఏవో వివరించారు.

ఈవోపీఆర్డీగా లక్ష్మీనరసమ్మ బాధ్యతలు

సోమందేపల్లి: సోమందేపల్లి మండల ఈవోపీఆర్డీగా లక్ష్మీనరసమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విలేకరులతో మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులతో సమన్వయం చేసుకొంటూ మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

పెనుకొండ : స్థానిక పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10వ తేదీన ఏపీఎస్ఎస్‌డీసీ, కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కేశవరావు, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి హరికృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 35ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. వివరాల కోసం స్కిల్‌హబ్ సమన్వయకర్త శివప్రసాద్‌ను 9676706976లో సంప్రదించాలని సూచించారు.

తల్లీ కుమార్తె అదృశ్యం..

పెనుకొండ: పట్టణ శివారులోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న శెట్టిపల్లికి చెందిన వెంకటేశ్ భార్య పద్మావతి, కుమార్తె స్నేహ సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ వివరించారు.

ఎంపీ దృష్టికి పాఠశాలల సమస్య

రొద్దం: ఆర్.మరువపల్లి ఎంజేపీ పాఠశాల వద్ద డ్రైనేజీ సమస్యతో మురుగు ఆవరణలోనే నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని వాటిని పరిష్కరించాలని స్థానిక ప్రిన్సిపల్ అనిత ఎంపీ బీకే పార్థసారథికి విన్నవించారు. అదేవిధంగా హిందూపురంలోని టేకులోడు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి సంబంధించిన ప్రిన్సిపల్ శోభారాణి తీసుకొచ్చి వివరించారు. ఎంపీ స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

సీపీఐ నాయకుడికి పోలీసుల నోటీసు

హిందూపురం: పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోకుండా ఈనెల 7న(సోమవారం) హిందూపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించినందుకు సీపీఐ నాయకుడు కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్‌కు ఒకటో పోలీస్ స్టేషన్ సీఐ రాజగోపాలనాయుడు మంగళవారం నోటీసు జారీ చేశారు. ర్యాలీలు, ప్రదర్శనలు, ధర్నా నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతి పొందాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.

పురంలో దాహం కేకలు

పట్టణం: హిందూపురం
ప్రాంతం: ధర్మపురం
జనాభా: 5వేలు
కుళాయి కనెక్షన్లు: 1000
రోజు సరఫరా చేయాల్సిన నీరు: 8 లక్షల లీటర్లు..
సమస్య: పది రోజులుగా కనీస స్థాయిలో నీటి సరఫరా లేదు. 10 రోజులకు గాను, 80 లక్షల లీటర్లు అందించాల్సి ఉంటే, 10 లక్షల లీటర్లు ఇవ్వలేకపోయారు.
కారణాలు: గొల్లపల్లి నుంచి నీటి సరఫరాలో అంతరాయం రావడం, ఈ ప్రాంతంలో నీటి సరఫరాకు ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి అనేక ప్రాంతాలకు ఇవ్వాల్సి ఉండటం, పైపులైన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం.

10 రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం



కాలనీలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలోని ధర్మపురం నడిబొడ్డున ఉన్న ప్రాంతం. ఈ కాలనీ పరిధిలోనే మున్సిపల్ కార్యాలయం ఉంది. కాలనీకి నీటిని అందించే ఉపరితల ట్యాంకు అక్కడే ఉంది. మున్సిపల్ కార్యాలయమే కాదు.. కమిషనర్ నివాస క్వార్టర్స్ కూడా ఈ కాలనీలోనే ఉన్నా నీటి సరఫరా జరిగి 10 రోజులు గడుస్తోంది. ఈ కాలనీలో ఉన్న నీటి ట్యాంకుతో ఈ ప్రాంతంతో పాటు పట్టణంలోని రహమత్‌పురం, సీపీఐ కాలనీ, బైపాస్ రోడ్ ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ట్యాంకు సామర్థ్యం వెయ్యి కిలోలీటర్లు కావడం, అది నిండటానికి, ఖాళీ చేయటానికి 12 గంటలు పడుతోంది. గొల్లపల్లి నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరిగినా, నిరంతరం పని చేసినా, రోజుకు రెండు సార్లు మాత్రమే ట్యాంకు నిండుతుంది. దీనికి తోడు ఈ ప్రాంతంలో ఉన్న పైపులైన్ పాతది కావడంతో తరచూ లీకేజీలు వస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేసి, నీటి సరఫరా చేయాల్సి ఉండటంతో తరచూ అంతరాయం ఏర్పడుతోంది.

ట్యాంకర్లతో సరఫరా సరిపోవడం లేదు



ఇంత జనాభాకు ఒకటి రెండు ట్యాంకర్లు పంపుతున్నారు. అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంజీఎం ట్యాంకుతో ఈ ప్రాంతానికి మాత్రమే సరఫరా చేసి, రహమత్‌పురం, సీపీఐ కాలనీకి వ్యవసాయ మార్కెట్టు సమీపంలో ఉన్న పీఏబీఆర్ ట్యాంకుతో నీటిని అందించాలి. **- షబానాభాను**

కొనుగోలు చేయలేకపోతున్నాం



ఇప్పటికే తాగునీటిని కొనుగోలు చేస్తున్నాం. చివరకు అన్ని అవసరాలకు నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. మున్సిపల్ కార్యాలయం, అధికారులు ఈ ప్రాంతంలోనే ఉన్నా, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపితేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. **- నూర్జాహా**

ప్రత్యేక నీటి ట్యాంకులు నిర్మిస్తాం

ధర్మపురంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నాం. శాశ్వత పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.20 కోట్లతో ఆర్టీసీ కాలనీ, సీపీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా నీటి ట్యాంకులు నిర్మిస్తాం. వాటికి నేరుగా కొట్నూరు సంపు నుంచి నీటి సరఫరా అయ్యేలా చూస్తాం. ఎంజీఎం ట్యాంకును ధర్మపురంలో సరఫరాకే పరిమితం చేస్తాం. **- బాలసుబ్రహ్మణ్యం, డీఈ, నీటి సరఫరా విభాగం.**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: వారం రోజుల నుంచి డీబీ కాలనీలోని గ్యాస్ గోదాము వరసలో చెత్త తీసుకెళ్లే వారు రావటం లేదు. **- రామ్మోహన్**
సమాధానం: వెంటనే ఇంటింటికి వెళ్లి చెత్తసేకరించేలా సిబ్బందిని ఆదేశిస్తా **- శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం**

సమస్య: గురునాథ్ కూడలి నుంచి రహమత్‌పూర్ కూడలి వరకు 20 గుంతలు ఉన్నాయి. వీటిని పూడ్చండి **- రామకృష్ణ, ఆర్టీసీ కాలనీ**
సమాధానం: మరమ్మతులు చేయిస్తాం **- మోహన్, సహాయ ఇంజినీర్, ఆర్అండ్‌బీ, హిందూపురం**

– న్యూస్‌టుడే, హిందూపురం

సమస్య: పట్టణ శివారులోని శ్రీసాయిచరణాశ్రమం వద్ద చికెన్‌వ్యాపారులు కోళ్లవ్యర్థాలు వేస్తున్నారు. దుర్గంధంతో అనారోగ్యం పాలవుతున్నాం. **-చరణ్‌కుమార్**
సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. మరోసారి చెత్తవేయకుండా అవగాహనకల్పిస్తాం. **-నాగరాజు, నగరపంచాయతీ మేనేజర్.**

–న్యూస్‌టుడే, పెనుకొండ

సమస్య: తాళికెర, గొల్లపల్లి మట్టి రోడ్డు గుంతలు పండింది. **- తిప్పేస్వామి**
సమాధానం: చదును చేయిస్తాం. **- నాగరాజునాయక్, ఈఓఆర్డీ, గుడిబండ**

సమస్య: చిగతుర్పిలో నీటి సమస్య ఉంది. **- నాగలింగప్ప**
సమాధానం: త్వరలో బోరు తవ్వించి పరిష్కరిస్తాం. **-ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర.**

– న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: భైరాపురంలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- రవీంద్రారెడ్డి**
సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మప్ప, కార్యదర్శి, కల్లూరు.**

సమస్య:- మానేపల్లిలో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలి. **- రామచంద్ర**
సమాధానం: సర్పంచితో చెప్పి ఏర్పాటయ్యేలా చూస్తాం. **- నరసింహామూర్తి, ఎంపీడీవో.**

– న్యూస్‌టుడే, లేపాక్షి

సమస్యలకు పరిష్కారం

లేపాక్షి: మండలంలోని పలు గ్రామాల సమస్యలను ప్రజలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం-మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కల్లూరులో కార్యదర్శి లక్ష్మప్ప ప్రత్యేక చొరవ తీసుకుని పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. బిసలమానేపల్లి పంచాయతీ ఓబుళాపురంలో సర్పంచి నరేంద్రకుమార్ వీధి దీపాలు ఏర్పాటు చేయించి అంధకారాన్ని తొలగించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలోని ఇందిరమ్మ బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభమయ్యాయి. మేమున్నాం మీకు తోడుగా శీర్షికలో ప్రచురితమైన వార్తకు స్పందిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి సవిత ఆదేశం మేరకు కాలనీలో రహదారి నిర్మాణానికి రూ.7లక్షల నిధులు మంజూరయ్యాయి. సోమవారం గుత్తేదారు భూమి చదును చేయించారు. నాలుగు రోజుల వ్యవధిలో సిమెంట్ రోడ్డు వేస్తామని గుత్తేదారు మహేశ్ తెలిపారు.



భరతనాట్యం భళా..

హిందూపురం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోని కల్యాణ వేదికలో మంగళవారం రాత్రి చిన్నారులు శివతాండవం, అఖిలాండేశ్వరి అన్న భక్తిగీతాలకు చేసిన భరతనాట్యం మహిళలను ఎంతోగానో ఆకట్టుకుంది.

గోరంట్లలో స్థలం వివాదం

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక హిందూపురం రహదారిలో స్టేట్‌బ్యాంకు సమీపంలో మంగళవారం స్థలం వివాదం కొనసాగింది. తాజాగా ఒక వర్గానికి చెందిన వారు ఫెన్సింగ్ వేయడానికి రాతిస్తంభాలు పాతారు. మరో వర్గం వారు వాటిని తొలగించారు. దీంతో సమస్య పోలీసు స్టేషన్‌కు చేరింది.

తాగునీటి వృథాను అరికట్టండి

ఉదుగూరు చెరువు పక్కన తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరుపైప్ నుంచి నీరు లీకేజీ అవుతూ వృథా అవుతోంది. సచివాలయానికి దగ్గరలోనే బోరు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై సర్పంచి హనుమక్కను వివరణ కోరగా మరమ్మతు చేసి లీకేజీని అరకడతామని తెలిపారు. –న్యూస్‌టుడే, అమరాపురం





కుంట కాదు ప్రధాన రహదారి

ఇక్కడ కనిపిస్తున్న నీటిని చూసి ఇదేదో నీటికుంట అనుకుంటే పొరబాటే. కదిరి నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలో పాలసముద్రం గ్రామచివరిలో మైన్‌రోడ్‌పై ఏర్పడిన గుంతలు. రాత్రి పగలు రద్దీగా ఉండే మార్గం. ప్రతిఏటా ఇక్కడ ఇలాగే గుంతలు పడుతున్నాయని, సంబంధిత శాఖాధికారులు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారని మాజీ సర్పంచి నరసింహులు, గ్రామస్థులు మండిపడుతున్నారు. రాత్రివేళల్లో చీకట్లో దారి కనిపించక గుంతలో నీరు నిలిచిన విషయం తెలియక ఎంతో మంది ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఈసమస్యను స్థానిక సర్పంచి గంగప్ప దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా సమస్య వాస్తవమని, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పాలసముద్రం (గోరంట్ల)

ముద్దబంతి తోట పరిశీలన

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న ముద్దబంతి తోటలను ఉద్యానశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. 'ముద్దబంతి.. ముద్దైంది శీర్షికన 'ఈనాడు'లో కథనం వెలువడింది. స్పందించిన ఉద్యానశాఖ అధికారులు తోటలను పరిశీలించి నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.


తూము వద్ద లీకేజీ.. ఇసుక బస్తాలతో అడ్డుకట్ట


ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్న రైతులు, చిత్రంలో ఇన్‌ఛార్జి డీఈ

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని మల్లాపల్లి చెరువు తూము వద్ద నీటి లీకేజీ అవుతుండడంతో భయాందోళనకు గురైన రైతులు మంగళవారం ఉదయం పెద్దఎత్తున తరలివచ్చి ఇసుకబస్తాలు వేసి లీకేజీ ఆపే ప్రయత్నం చేశారు. స్థానిక సర్పంచి శివానంద, నీటిపారుదల శాఖ ఇన్‌ఛార్జి డీఈ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఈకార్యక్రమం చేపట్టారు. బుధవారం జేసీబీ ద్వారా మట్టివేసే చర్యలు చేపడతామని డీఈ న్యూస్‌టుడేకు తెలిపారు.


హిందూపురం: గజస్త్రాలంకరణలో వీరకేతమ్మ


ముద్దిరెడ్డిపల్లి : అన్నపూర్ణేశ్వరిగా


ప్రాత్యాయినిదేవిగా మధుగిరిమారెమ్మ


గాజుల అలంకరణలో చౌడేశ్వరిమాత


పరిగి: సప్తమాతృకాదేవి

జగజ్జననీ.. బహురూపిణి

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పలు ఆలయాల్లో వెలసిన అమ్మవార్లను విభిన్న రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ఆలయాల్లో సంగీత కచేరీ, చిన్నారులచే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం


లేపాక్షిలో రాజరాజేశ్వరిగా


నానెప్పనగర్‌లో గాయత్రీదేవి


కల్లుమర్రి వీరక్యాతమ్మ


సోమందేపల్లి: మహాలక్ష్మిగా చౌడేశ్వరీదేవి


రొళ్ల: సరస్వతీమాతగా కాళికాంబాదేవి

ఆశించిన స్థాయిలో అందని దరఖాస్తులు

◆ పురంలో 11 దుకాణాలకు 75 దరఖాస్తులు ◆ 11వ తేదీ వరకు గడువు


టెండర్ల బాక్సులను పరిశీలిస్తున్న సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం దుకాణలు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినా ఆశించిన స్థాయిలో అందలేదు. హిందూపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు ప్రభుత్వం 11 మద్యం దుకాణాలు కేటాయించింది. వీటికి మంగళవారం వరకు 75 దరఖాస్తులు అందాయి. 11 వరకు గడువు పొడిగించినా దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం కనిపించటం లేదు. దీనివలన ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్న ఆశ సన్నగిల్లింది. దరఖాస్తు చేయాలని ఎక్కువ మందిలో ఆసక్తి ఉన్నప్పటికి లాటరీలో తమకు మద్యం దుకాణం కేటాయిస్తే తాము ఎలా వ్యాపారాలు చేసుకోవాలనే విషయంలో వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందువలన ఆశించిన స్థాయిలో దరఖాస్తులు అందలేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో మద్యం ధరలకన్నా ఇక్కడ తక్కువగా ఉన్నందున కర్ణాటక వారు దరఖాస్తు వేయటానికి ఉత్సాహం కనబరుస్తున్నా పై కారణాలతో వారు ముందుకు రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా దరఖాస్తుదారులు ఎక్కడినుంచైనా దరఖాస్తు చేసుకొనే అవకాశాలు కల్పించామని కార్యాలయంలో కూడా వారికోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశాం. బుధవారం సాయంత్రంతో గడువు ముగుస్తుండగా ఔత్సాహికులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెనుకొండలో 126..

పెనుకొండ : స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గోరంట్ల, సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాలకు సంబంధించిన 13మద్యం దుకాణాలకు మంగళవారం రోజు 34దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 126దరఖాస్తు అందాయని వివరించారు.

నిరాశ్రయురాలికి ఆర్థిక సాయం

లేపాక్షి, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు కోడిపల్లికి చెందిన లక్ష్మమ్మ ఇళ్లు పైకప్పు కూలి నిరాశ్రయురాలైంది. విషయాన్ని గ్రామస్థులు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ దృష్టికి తేవడంతో స్పందించిన ఆయన లక్ష్మమ్మకు తన వంతు సాయంగా రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఐదులాంతర్ల సర్కిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి మంగళవారం స్థానిక మేళాపురానికి చెందిన కుటాల నారాయణ వారి కుమారుడు ప్రకాష్ (అమెరికా) రూ.2,01,116లు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

భారీ వర్షాలకు కుప్పకూలిన ఇళ్లు


పడిపోయిన ఇంట్లో బాధితులు

అగళి, న్యూస్‌టుడే: మండలంలోని ఇరిగేపల్లి గ్రామానికి చెందిన లలితమ్మ భర్త శివన్నతో పాటు ఇద్దరు పిల్లలు నివాసం ఉంటున్న ఇల్లు సోమవారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. నందరాజనపల్లి గ్రామానికి చెందిన తిమ్మక్క నివాసం ఉన్న ఇల్లు పైకప్పు కూడా పడిపోవడంతో ఆమె బయట నిదరపోతోంది. పెద్ద ప్రమాదమే తప్పిందని ఆమె కూడా తెలిపారు. స్థానిక సర్పంచి లక్ష్మమ్మ కుటుంబ సభ్యుడు మంజుచరణ్ బాధితులను పరామర్శించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బాధితులకు కొత్తగా గృహాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు.

ఆటల్లో ఆసక్తి.. లక్ష్యం వైపు అడుగులు

కల్లుమర్రి, గౌడనహళ్లి పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఆటలపై ఉన్న ఆసక్తి వారిని విజయపథం వైపు నడిపిస్తోంది. అరకొర సౌకర్యాలున్నా ఏకాగ్రత, పట్టుదలతో సాధన చేసి అంచెలంచెలుగా ఎదిగి లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. మడకశిర మండలం కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.చరణ్ అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో రాణించాడు. గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని కృష్ణవేణి బ్యాడ్మింటన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. భవిష్యత్తులో వారి లక్ష్యాలు వారి మాటల్లోనే..

ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని



అమ్మానాన్న దుర్గప్ప, గంగమ్మలు దినసరి కూలీలు. బెంగళూరులో కూలీ పనులు చేసుకుంటూ చదివిస్తున్నారు. నాకు వాలీబాల్ అంటే చాలా ఇష్టం. పీడీ ప్రకాశ్‌రెడ్డి వాలీబాల్‌లో మెలకువలు నేర్పించారు. జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఎంతో సంతోషంగా ఉంది. అక్కడ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాణిస్తా. క్రీడలతోపాటు బాగా చదివి భవిష్యత్తులో ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని ఉంది. **- బి.చరణ్**

ఐపీఎస్ కావాలన్నదే లక్ష్యం



అమ్మానాన్నలు బాలకృష్ణ, కవిత. అమ్మ గృహిణి. నాన్న బెంగళూరులో ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజరుగా పనిచేస్తున్నారు. బ్యాడ్మింటన్ అంటే ఇష్టం. ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొందడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పీఈటీ అరుణ మంచి సాధన చేయించారు. మరింత పట్టుదలతో ఆడి జాతీయస్థాయిలో విజయం సాధిస్తా. క్రీడలతోపాటు బాగా చదివి భవిష్యత్తులో ఐపీఎస్ అధికారి కావాలన్నదే లక్ష్యం. **-బి.కృష్ణవేణి, 7వ తరగతి**

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

ఆసుపత్రికి మంచాల వితరణ

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల ప్రభుత్వ ఆసుపత్రికి 4 మంచాలు, 4 పరుపులను పెన్నబడివాండ్లపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వితరణ చేసినట్లు వైద్యుడు అష్పాఫ్ తెలిపారు. మంగళవారం వాటిని ఆసుపత్రికి పంపిణీ చేశారన్నారు. ఈ మంచాలు రోగులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రనాయక్ సమక్షంలో దాతను సత్కరించారు. ఆయన మాట్లాడారు. ఈ మంచాలు రోగులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆశ్రిత, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

తెదేపా కార్యకర్తపై వైకాపా నాయకుడి దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: దర్శినమల గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త ధనుంజయపై మంగళవారం ఓబుళనాయునిపల్లికి చెందిన వైకాపా నాయకుడు గంగాధర్, దర్శినమలకు చెందిన రామ్మోహన్ దాడి చేశారు. గాయపడిన ధనుంజయను చికిత్స నిమిత్తం గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దర్శినమల గ్రామ సమీపంలో ఉన్న తన పొలానికి వెళ్లే రహదారిని వైకాపా నాయకుడు గంగాధర్, రామ్మోహన్ పొక్లెయిన్‌తో తవ్విస్తుండటంతో దారి ఎందుకు తవ్వేశారని అడగడంతో తనపై గంగాధర్ రాయితో దాడి చేశాడని ధనుంజయ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం కొడవలితో దాడి చేసే యత్నం చేయడంతో తాను ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్లిపోయానని పేర్కొన్నాడు. తెదేపా కార్యకర్తపై దాడి ఘటన తెలియడంతో గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ధనుంజయ ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కదిరి కుర్రాళ్లు.. ఫుట్‌బాల్ ఆడేస్తున్నారు

✦ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణింపు

కదిరి, న్యూస్‌టుడే: వ్యవసాయ, కూలీ కుటుంబాలు. శ్రమశక్తి ఆధారంగా గడిచే కుటుంబాలకు చెందిన కుర్రాళ్లు. ఆటతోనే బతుకు బాట మారాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. దీంతో ఉన్నత పాఠశాల స్థాయి నుంచే ఫుట్‌బాల్‌లో సాధన చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించటంతో పాటు ప్రైవేటు కంపెనీల తరఫున పోటీల్లో పాల్గొంటున్నారు. కదిరి ప్రాంతానికి చెందిన తరుణ్‌కుమార్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జగదీష్‌లు అంచలంచెలుగా ఎదుగుతూ ప్రశంసలు అందుకుంటున్నారు.



ఇండియా జట్టుకు ఆడాలన్నదే లక్ష్యం

ఓబుళదేవరచెరువు మండలం జంబులవాండ్లపల్లి వ్యవసాయ కుటుంబానికి చెందిన రామచంద్రరెడ్డి, అనురాధల కుమారుడు తరుణ్‌కుమార్‌రెడ్డి. డిగ్రీ చదువుతున్న ఈ కుర్రాడు ఏడేళ్ల వయసు నుంచి ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నాడు. ఇండియా జట్టుకు ఆడాలన్నదే లక్ష్యంగా ఆటపై దృష్టి పెట్టాడు. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. తర్వాత ఆర్డీటీ అకాడమీకి ఎంపికైన తరుణ్ నాలుగేళ్లు ఆంధ్రా జట్టుకు ఆడాడు. సౌత్‌జోన్, ఇంటర్ యూనివర్సిటీకి మూడేళ్లు ఆడాడు. ప్రస్తుతం రూట్స్ ఫుట్‌బాల్ క్లబ్ తరఫున బెంగళూరు సూపర్ డివిజన్‌కు ఆడుతున్నాడు.

- తరుణ్‌కుమార్‌రెడ్డి, క్రీడాకారుడు



గోల్‌కీపర్‌గా ప్రత్యేకత చాటాలని.. - జగదీష్, క్రీడాకారుడు

కదిరిలోని రాయచోటిరోడ్డు ప్రాంతానికి చెందిన జగదీష్ తండ్రి చలపతి డ్రైవర్, తల్లి అరుణ గృహిణి. కొత్తచెరువులోని మంగళకర కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గోల్‌కీపర్‌గా ఉత్తమ ప్రదర్శనతో రెండు సార్లు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆర్డీటీ నిర్వహించిన ఏఎఫ్ఎల్ లీగ్‌లో గోల్‌కీపర్‌గా కీలక పాత్రను పోషించి కదిరి జట్టును జిల్లా విజేతగా నిలిపాడు. బెంగళూరు ఎయిర్‌వేస్ క్లబ్ సి డివిజన్‌కు మూడు ఏళ్లు ఆడాడు. ప్రస్తుతం గుంటూరులో జరుగుతున్న సీనియర్ జిల్లా జట్టుకు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడుతున్నాడు.



క్రీడాకారుడిగా గుర్తింపు కోసం - ప్రవీణ్‌కుమార్

కదిరి అడపాలవీధికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఫుట్‌బాల్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు సాధించాలన్న లక్ష్యంతో పట్టుదలగా ఉన్నాడు. తండ్రి లేకపోవటంతో తల్లి పద్మావతి సహకారంతో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సాధన చేస్తున్నాడు. ఓబుళదేవరచెరువులో డిగ్రీ చదువుతున్నాడు. వాల్మీకి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచే ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నాడు. ప్రస్తుతం గుంటూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయిల్లో జిల్లా జట్టుకు ఆడుతున్నాడు.

వృద్ధురాలి ఇంటి సమస్య పరిష్కారం

కొత్తచెరువు: కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు పెద్దక్క ఇంటి సమస్యపై ఆర్డీవో సువర్ణ క్షేత్రస్థాయిలో విచారించారు. దశాబ్దకాలంగా వృద్ధురాలు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవో సువర్ణను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. దీంతో ఆర్డీవో మంగళవారం తహసీల్దార్ నీలకంఠారెడ్డితో పాటు కేశాపురం చేరుకున్నారు. వృద్ధురాలి ఇంటిని పరిశీలించి స్థానికులను విచారించారు. సర్వేయర్ సురేష్‌తో కొలతలు వేయించారు. వీధిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటికి ప్రహరీ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. డీటీ బాలాంజనేయులు, వీఆర్వో రమేష్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కేశాపురంలో వృద్ధురాలు పెద్దక్క సమస్యపై విచారిస్తున్న ఆర్డీవో సువర్ణ

తాగునీటి సరఫరాకు ఎమ్మెల్యే చొరవ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ మదీన కాలనీలో తాగునీటి సమస్యతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం మదీన కాలనీలో నూతన బోరు బావిని తవ్వించి సమస్యను పరిష్కరించడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, తెదేపా నాయకులు గంగులప్ప, ఈశ్వరయ్య, ప్రేమలత, యూనస్, అన్వర్ బాష పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కదిరి: మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను బదిలీ చేస్తూ మున్సిపల్ పరిపాలనా సంచాలకుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఆయన ఉద్యానశాఖ సహాయ సంచాలకుడిగా ఉన్నారు. డెప్యుటేషన్‌పై నియమించటంతో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం మాతృశాఖకు పంపినట్లు సమాచారం.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: విజయదశమి పండగను పురస్కరించుకుని ముదిగుబ్బ మండలంలో పనిచేస్తున్న 36 ప్రభుత్వ తాగునీటి, పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీపీ ఆదినారాయణయాదవ్ దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్మికులకు చీరలు, పంచెలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛగా ఉంచేందుకు కృషిచేస్తున్న కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల, సర్పంచి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాదాలపై అధిక ఫిర్యాదులు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా విద్యుత్తు ప్రమాదాలపై పోలీసులకు ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, వాటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి తమపై భారం తగ్గించాలని స్థానిక పోలీసులు మండల సర్వసభ్య సమావేశంలో ఉన్నతాధికారులకు విన్నవించారు. మంగళవారం తాడిమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో రంగారావు, ఎంపీపీ భువనేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎం బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండల వెలుగు ఏపీఎంగా నారాయణ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రారెడ్డి పుట్టపర్తికి బదిలీ కావడంతో ఏపీఎం స్థానం ఖాళీ ఏర్పడింది. గోరంట్లలో పనిచేస్తున్న నారాయణను ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. అలాగే కొత్తచెరువు పట్టణం, తలమర్ల సీసీలుగా సదాశివరెడ్డి, కృష్ణారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

పనిభారం పెంపుపై ఈయూ ఆందోళన

ధర్మవరం: ధర్మవరం ఆర్టీసీ డిపోలో పెంచిన పనిభారాన్ని తగ్గించాలని మంగళవారం 3వ రోజు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్మవరం ఆర్టీసీ డిపోలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ డిపోలోనూ లేని విధంగా ఓటీ శాతం ధర్మవరం డిపోలో 47 శాతం ఉందని, ఇది చాలదన్నట్లు అదనంగా మరింత పనిభారాన్ని పెంచి ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. పనిభారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయంపై నిరసన

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని రామ్‌నగర్‌లో విద్యుత్తు నియంత్రిక అధికలోడ్ కారణంగా ఫ్యూజ్‌లు పోయి రోజూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని మంగళవారం తారకరామాపురం విద్యుత్ కార్యాలయం వద్ద రామ్‌నగర్‌వాసులు నిరసన తెలిపారు. సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుండటంతో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని, చేనేత కార్మికులు విద్యుత్ లేనప్పుడు మగ్గం నేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఏఈ కొండారెడ్డికి తెలిపారు. సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

సీనియర్ నాయకుడి మృతి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలంలో తెదేపా, కమ్యూనిస్టు పార్టీ రాజకీయాల్లో కొనసాగిన సీనియర్ నాయకుడు దూపంపల్లి బాషు (90) మృతి చెందారు. బీసీ కాలనీలో నివసిస్తున్న ఆయన గత కొంతకాలంగా వయోభారం, అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. తెదేపా స్థాపనతో తొలిసారి జరిగిన ఎన్నికల్లో బాషు క్రియాశీలకంగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేశన్నకు అనుచరుడిగా గుర్తింపు పొందారు. తరువాత స్థానిక కమ్యూనిస్టు రాజకీయాల్లో కొనసాగారు. ఆయనకు భార్య రహమత్‌బీ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్య

చక్రాయపేట, న్యూస్‌టుడే: భర్త, అత్త వేధింపులు తాళలేక పెళ్లైన ఆరు నెలలకే ఓ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన వైఎస్ఆర్ జిల్లా, చక్రాయపేట మండల పరిధిలోని అద్దాలమర్రిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ నాగరాజు వివరాల మేరకు.. అద్దాలమర్రికి చెందిన గంగాసుమతి (19)కి ఆరునెలల కిందట కదిరి పట్టణానికి చెందిన తోళ్లపల్లె ప్రసాద్‌తో వివాహమైంది. భర్త ప్రశాంత్‌తో పాటు అత్త కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నారు. ఇటీవల గంగాసుమతి పుట్టింటికి వచ్చారు. అయినా భర్త, అత్త చరవాణిలో వేధించేవారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కాజేసిన భూములకు గుట్టుగా రిజిస్ట్రేషన్

● రియల్టర్లే రైతుల భూములు విక్రయించిన వైనం ● నిలదీసిన బాధితులు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: సీకేపల్లి మండలం న్యామద్దల గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ సంస్థ మూడేళ్లుగా నిర్మాణాలు చేపడుతోంది. ఆ కంపెనీ ప్రతినిధులు వంద ఎకరాల చెరువు ఆయకట్టు భూములను కొనుగోలు చేసి కంపెనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇదే అదనుగా భావించిన కొందరు రియల్టర్లు అమాయకులైన కొందరు రైతులకు చెందిన పట్టా భూములకు యజమానులు తామేనంటూ విక్రయించారు. మూడేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం తెలియని కంపెనీ ప్రతినిధులు రైతుల భూములు తమవిగా భావించి స్వాధీనం చేసుకుని నిర్మాణాలు సాగిస్తున్నారు. కొందరు రైతులు తమ పంట రుణాలను నవీకరించేందుకు బ్యాంకులకు వెళ్లగా మీ భూమిని ఓ కంపెనీకి విక్రయించినట్లు తెలపడంతో వారు నివ్వెరపోయారు. ఇదేంటని కంపెనీ ప్రతినిధులను నిలదీయగా.. తమకు సంబంధం లేదని విక్రయించిన వారిని సంప్రదించాలని సూచించినట్లు తెలిసింది. రియల్టర్లకు వద్దకు వెళ్లి తమ భూములను విక్రయించడానికి మీరెవరని ప్రశ్నించగా లెక్కలేకుండా మాట్లాడటంతో చేసేది లేక రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ తతంగమంతా గత వైకాపా ప్రభుత్వంలోనే సాగినట్లు, రియల్టర్లు కూడా అదే పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు సైతం వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధిత రైతుల నుంచి తాము ఎక్కడ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోననే ఉద్దేశంతో రియల్టర్లు వారు తమ పేర్లతో విక్రయించిన భూములను మంగళవారం తిరిగి పలువురు బాధిత రైతులకు సీకేపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. విషయం తెలుసుకున్న మరికొంతమంది బాధిత రైతులు అక్కడికి చేరుకుని తమకు న్యాయం చేయాలని కంపెనీ ప్రతినిధులు, రియల్టర్లను నిలదీశారు. అప్పటికే రిజిస్ట్రేషన్ తతంగం ముగియడంతో వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ దృష్టికి తీసుకుపోగా ఇద్దరు రైతులకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు.

తెదేపాతోనే ప్రజా సంక్షేమం

కనగానపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముత్తవకుంట్ల, పాతపాళ్యం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గత వైకాపా పాలనలో ఒక్క మీటరు సీసీ రహదారులు కూడా నిర్మించలేదన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.4.60 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ సర్పంచులు ఆంజనేయులు, నారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: బీసీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిపూట ఇబ్బందులు వర్ణనాతీతం.

- శివారెడ్డి, తాడిమర్రి

సమస్య: తాడిమర్రి బీసీకాలనీలో వీధిలైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చీకట్లోనే ఉంటున్నాం. రాత్రిపూట విషసర్పాలతో భయంగా వుంది. **- శ్రీనివాసులు**

సమస్య: తాడిమర్రిలో కాలువల్లో మురుగు సక్రమంగా తొలగించడం లేదు. **- రంగప్ప, తాడిమర్రి**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి కంపచెట్లను తొలగించి సమస్య పరిష్కరిస్తాం. బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగనిచోట కొత్తవి ఏర్పాటు చేస్తాం. కాలనీలో మురుగు కాలువలు రోజూ శుభ్రం చేసేలా చర్యలు చేపడతాం.

(పై మూడు సమస్యలకు పంచాయతీ కార్యదర్శి రిజ్వాన్‌బేగం సమాధానాలిచ్చారు.)

– న్యూస్‌టుడే, తాడిమర్రి



సభ్యత్వం నమోదు చేస్తున్న మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, భాజపా నాయకుడు అంబటి సతీష్

భాజపా సభ్యత్వ నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు అంబటి సతీష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చరవాణిలో సభ్యత్వ నమోదు చేసి వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, నాయకులు డోలా రాజారెడ్డి, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లి: న్యామద్దలలో మహేశ్వరి



నల్లమాడ: సరస్వతిగా గంగమ్మ



ధర్మవరం: నరసింహ స్వామిగా శ్రీనివాసుడు



ధర్మవరం: లక్ష్మీచెన్న కేశవపురం కాలనీలో



ముదిగుబ్బ: సుబ్రహ్మణ్యేశ్వర స్వామిగా



తాడిమర్రి: మహాలక్ష్మి అలంకరణలో



బత్తలపల్లి: మహాలక్ష్మి అలంకరణలో



తనకల్లు: రాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి

అమ్మ వైభవం.. వర్ణనాతీతం



కదిరి: పరమపదనాథుడిగా ఖాద్రీశుడు..

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆరో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి, అన్నపూర్ణదేవిగా, శాకంబరి, ధనలక్ష్మి, సరస్వతీ అలంకరణలో కొలువయ్యారు. భక్తులు ఉదయం నుంచే మండపాలు, ఆలయాలకు చేరుకుని సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, హోమాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి భక్తితో కొలిచారు. విద్యుత్తు దీపకాంతుల్లో మిరుమిట్లు గొలుపుతున్న ఆలయాలు, రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనాలు, వీనుల విందుగా జగన్మాత స్తోత్రాలు అంతటా ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి.

– న్యూస్‌టుడే బృందం



పుట్టపర్తి గ్రామీణం: మహాలక్ష్మిగా దుర్గాదేవి

పాఠశాలలో చోరీ

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని బాలసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి దుండగులు తలుపులు ధ్వంసం చేసి క్రీడా సామగ్రి ఎత్తుకెళ్లారు. పాఠశాల తలుపులు తెరిచి టేబుళ్లు, బీరువాలను పడేశారు. అనంతరం వినియోగంలో లేని మరుగుదొడ్ల తలుపులను విరగ్గొట్టారు. అందులో ఉన్న ఆట వస్తువులను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. పాఠశాలలో నాడు- నేడు పనుల్లో భాగంగా వంటగది నిర్మాణం జరుగుతోంది. తరగతి గదిలో ఉన్న పైపులు, విద్యుత్ సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారు. దసరా సెలవులు కావడంతో అటువైపు ఎవరూ వెళ్లని కారణంగా మంగళవారం గుర్తించిన స్వీపరు పాఠశాల కమిటీ ఛైర్మన్ నరసింహులుకు సమాచారం ఇచ్చింది. తనకల్లు పోలీసు స్టేషన్‌లో నరసింహులు, ఉపాధ్యాయురాలు నీలాభాయి వేరువేరుగా ఫిర్యాదు చేశారు.

మందుబాబుల తిష్ట : పాఠశాల గ్రామానికి దూరంగా ఉండటంతో రాత్రి సమయంలో నిత్యం మందుబాబులు ఇక్కడే మద్యం తాగుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పాఠశాల ఆవరణలోనే మందుసీసాలు దర్శనమిస్తున్నాయి.



పాడయిన మరుగుదొడ్ల తలుపులు, చిందరవందరగా వస్తువులు

కంది పంటను దున్నేశారంటూ ఫిర్యాదు

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే: ఎన్పీకుంట మండలం బందారుచెట్లపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, రామకృష్ణలకు చెందిన కంది పంటను కదిరికి చెందిన కొందరు దున్నేశారంటూ మంగళవారం పోలీసులు, రెవెన్యూ కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు. . బందారుచెట్లపల్లిలో తమకున్న 12 ఎకరాల్లో కంది పంటను సాగు చేసినట్లు తెలిపారు. కంది ఏపుగా పెరిగింది. కాగా కదిరికి చెందిన కొందరు వ్యక్తులు ఐదెకరాల్లో పంటను దున్నేశారు. బాధిత రైతులు పంటను దున్నివేసిన ప్రాంతంలో విలపించారు. పంటను దున్నేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రస్తా వివాదంలో ఘర్షణ.. దంపతులపై కేసు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం వీరేపల్లిపేటలో రస్తా వివాదంలో చోటుచేసుకున్న ఘర్షణలో దంపతులపై కేసు నమోదైంది. కదిరి గ్రామీణ పోలీసులు తెలిపి మేరకు వివరాలు.. వీరేపల్లిపేటకు చెందిన సురేంద్రరెడ్డి పొలంలో గతం నుంచి రస్తా ఉంది. మంగళవారం ఆ మార్గంలో రమణ, అరుణమ్మ దంపతులను సురేంద్రరెడ్డి అడ్డుకున్నారు. ఈ వివాదం ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. భార్యాభర్తలిద్దరూ తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సురేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణ, అరుణమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొక్కంటి గ్రామానికి చెందిన దంపతులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. కొక్కంటి గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య రమణమ్మతో కలిసి ద్విచక్ర వాహనంలో సీజీ ప్రాజెక్టు వైపు వెళ్తున్నారు. గ్రామసమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. శ్రీనివాసులుకు కాలు విరగ్గా, రమణమ్మ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

అదనపు కట్నం తేవాలంటూ వేధింపులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తనభర్త అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారంటూ కదిరి పట్టణం రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయిని యజ్దాన మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యజ్దాన భర్త జాకీర్ అహమ్మద్ విద్యుత్తు శాఖలో పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. అదనపు కట్నం కోసం రోజూ హింసిస్తున్నారంటూ ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేయడంతో జాకీర్ అహమ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నల్లమాడ, న్యూస్‌టుడే: బాసంవారిపల్లిలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పుట్టపర్తి నుంచి కదిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనకాలే కారు వస్తోంది. బాసంవారిపల్లి వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద ఆర్టీసీ బస్సు వేగాన్ని తగ్గించడంతో వెనుకనే వేగంగా వస్తున్న కారు ఒక్కసారిగా బస్సును వెనుకవైపు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

బదిలీ అధికారులకు సన్మానం



బదిలీ అధికారులను సన్మానిస్తున్న మండల అధికారులు, ప్రజాప్రతినిధులు

నంబులపూలకుంట(గాండ్లపెంట), న్యూస్‌టుడే: ఎన్పీకుంట మండలంలో వివిధ శాఖలలో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో మనోహర్ బాబు, గ్రానీస అధికారి జయమ్మ, సీనియర్ సహాయకుడు లోకా మల్లికార్జునరెడ్డి, టైపిస్టు రవిచంద్రలను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రాము, మండల ప్రత్యేకాధికారి సురేంద్ర, ఈవోఆర్డీ మాధవరెడ్డి, ఏఓ లోకేశ్వరరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, వైద్యురాలు సఫియా, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు లక్ష్మీదేవి, జేఈ హిబబిందు, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. **పుట్టపర్తి గ్రామీణం:** ఉద్యోగులు ఎక్కడ పనిచేసేనా విధి నిర్వహణలో ప్రజల సేవలో తరించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీసత్యసాయిజిల్లా పంచాయతీ పాలనాధికారి నాగరాజు బదిలీపై అనంతపురం వెళుతున్న సందర్భంగా మంగళవారం జిల్లా కార్యాలయంలో వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఉద్యోగులు సమత, చాసావలి, మహేష్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

తలుపుల, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. ప్రధాన అధికారులకు బదులు కిందిస్థాయి సిబ్బంది ఎక్కువ రావడంతో పాలకవర్గం సభ్యుల్లోనూ నిరుత్సాహం నెలకొంది. దీంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మొక్కుబడిగా ముగించారు. తహసీల్దార్ రెడ్డిశేఖర్, పరిపాలనాధికారి రామానాయక్, పాలకవర్గం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. **నంబులపూలకుంట(గాండ్లపెంట):** ఎన్పీకుంట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాము అధ్యక్షతన మంగళవారం సాగింది. వివిధ శాఖల మండల అధికారులు తమ శాఖల అభివృద్ధి పనులపై పనితీరును వివరించారు. శ్రీకాళహస్తికి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని ఎంపీపీ ఆర్టీసీ అధికారులకు కోరారు. ఏవో లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ వేరుసెనగ పూర్తిగా దెబ్బతిన్నదని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సురేంద్ర, ఎంపీడీవో మనోహర్‌బాబు, ఈవోఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, వైద్యురాలు సఫియా పాల్గొన్నారు.

భగవంతుడి ఆరాధనతో మానసిక ప్రశాంతత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భగవంతుడిని నిత్యం ఆరాధించడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అధ్యాపకుడు కేవీఎన్ నరేష్ పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంతి నిలయంలో వేదపురుష జ్ఞానయజ్ఞం మూడో రోజు వేదపండితులు నిర్వహించారు. సాయికుల్వంత్ మందిరంలో విజయదశమి పర్వదిన వేడుకల్లో భాగంగా విద్వాన్ మహాసభను సాయి విద్యార్థులు వేదపఠనం పఠిస్తూ.. ప్రారంభించారు. భక్తులు వేడుకలను తిలకించడానికి తరలిరావడంతో ప్రశాంతి నిలయం కిటకిటలాడుతోంది.

కింది వంతెన మార్గంలో ఊటనీటితో పాట్లు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేటకు వెళ్లే మార్గంలో రైల్వే కింది వంతెన రహదారిపై ఊటనీరు వస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదకరంగా వెళుతున్నారు. వంతెన కింద రెండువైపులా రహదారిపై నిత్యం ఊటనీటి ప్రవాహం ఉండటంతో రహదారి పాచిపట్టి జారుతోంది. పట్టణం నుంచి కొత్తపేట రైల్వేస్టేషన్ ప్రాంతాలకు వెళ్లేవారు ఊటనీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు వాహనం అదుపుతప్పి ప్రమాదం బారిన పడుతున్నారు. కాలినడకన వెళ్లాలంటే ఎక్కడ జారి కిందపడతామేమోనని భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది. రైల్వే, పురపాలక అధికారులు సరైన చర్యలు చేపట్టి రైల్వే కింది వంతెన మార్గంలో ఊటనీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తపేట వెళ్లే రహదారిలో రైల్వే కింది వంతెనపై నిలచిన ఊటనీరు